''డబ్బేమయినా ఉంటే చూడు గురూ.''

జేబులోంచి రూపాయినోటు తీసి కళ్ళతో చూసి ''చూశాను'' అన్నాడు రావు.

''అదేమిటి ?'' అన్నాడు మూర్తి తెల్లబోతూ.

నవ్వాడు రావు. ''గారడీవాడు తమాషా చేసేముందు 'కళ్ళు మూసుకోండి..చప్పట్లు కొట్టండి' అంటాడు. అలాగే నువ్వుకూడా ఏమయినా చేయబోతున్నావేమో ననుకున్నాను.''

మూర్తికూడా నవ్వేశాడు. ''అది కాదు గురూ, నాకు డబ్బు కావాలి. ఏమయినా సర్దగలవా అని.''

''అలా ఏడవకూడదూ—నేథవ వాక్యం దేనికి ?... లేదు.''

''లేదంటే కాదు చూడాలి. అంతే !''

''అవునురా లేదంటుంటిని కదా !''

కుర్చీ లాక్కొని పక్కన కూర్చున్నాడు మూర్తి ''నువ్వు కాదంటే మునిగిపోతాను గురూ, ఎలాగోలా ఈ సాయం చేయాలి.''

''ఇప్పటికొచ్చావు దారిలోకి — డబ్బడగవలసిన పద్ధతి ఇది. ఎంత కావాలేమిటి ?''

''మూడొందలు.''

''వందలే !''

''అవును.''

''ఎందుకో ?''

సిగ్గుపడ్డాడు మూర్తి.

''ఫరవాలేదు చెప్పరా.''

''మా ఆవిడతో మద్రాసు, హైదరాబాదు తీసుకు వెడతానని వాగ్దానం చేశాను.''

''అయితే అప్పుచేసి ఆ వాగ్దానం నెరవేర్చుకోవాలా ఏమిటి ?''

నవ్వాడు మూర్తి. ''మా ఆవిడ ఇప్పుడు ఒట్టిమనిషి కాదు గురూ, నాలుగో నెల.''

''కంగ్రాట్స్ మై బాయ్ ! కనుక తప్పకుండా నీ వాగ్దానం నెరవేర్చుకోవాలన్న మాట ! ఆల్‌రైట్ అయితే నన్నడిగి ఉపయోగం ఏముంటుందిట — పది, ఇరవయి అయితే ఇవ్వగలను గానీ !''

''తెలుసుగాని ఇవ్వగలిగిన వాళ్ళు లేదన్నారు.''

''అయితే దండయాత్ర అయిపోయిందన్నమాట ! నాగేశ్వరరావు, మోహనరావు, రామేశ్వరశాస్త్రి...''

అతని జాబితా పూర్తికాకుండానే మధ్యలోనే అందుకున్నాడు మూర్తి, వాళ్ళ సమాధానాలు వరుసగా ''నా దగ్గరా — డబ్బా'', ''ఎన్నడిగితే బావుండేదోయ్'', ''ఈ నెల

# క్రేజ్




సింగరాజు రామచంద్రమూర్తి

దాటితే చూడగలను'' అని.

నవ్వేశాడు రావు. ''అయినా పట్టు వదలని విక్రమార్కుడిలా నా దగ్గర ప్రయత్నం చేస్తున్నావు. అవునా.''

''మరింకెవరిని అడగను. అన్నట్టు తిరుపతికూడా ఉంది మా కార్యక్రమంలో.''

''వెధవ తెలివికి పోకు — దేముడి పేరు చెబితే ఇవ్వగలవాడిని ''ఊరికేమాత్రం ఇవ్వనా ?... సరే చూద్దాం''...

నాలుగు రోజులు పోయాక రావు చుట్టూ జనం పోగయ్యారు. అతను వేసుకున్న చొక్కాని రకరకాల పరీక్షలు చేస్తున్నారు వాళ్ళంతా.

''ఎంత బావుందో!'' అన్నారొకరు.

''ఎక్కడిది గురూగారూ ?''

''ఆఁ, మద్రాసులో మా బావమరిది ఉంటే తెప్పించాను. స్మగుల్డ్ వస్తువుల్ని గవర్నమెంటువారు పట్టుకున్నవి స్టోర్సులో పెట్టి అమ్ముతున్నారక్కడ. ఇది జపాన్ తయారీ — మీటర్ ఇరవయిరెండు రూపాయలు.''

కనుబొమలు ఆశ్చర్యంతో పైకిలేచాయి.

''ఇటువంటిది మన షాపుల్లో నలభయిరెండు రూపాయిలు !''

''స్వార్థపరుడివయ్యా రావు గారూ, అచేత్తో మాక్కూడా తెప్పిస్తే నీదేంపోయిందో ?''

నవ్వాడు రావు ''సర్లె, తీరా తెప్పించి ఎవరూ వద్దంటే నేను తలంటుకోవాలి'' అన్నాడు.

''అక్కడికి మేమంతా ఖర్చు పెట్టలేనివాళ్ళం — సగానికి సగం ఖరీదులో వస్తుంటే కొనని దెవరు ?''

''మీక్కావాలా చెప్పండిప్పుడు పోనీ.''

''కావాలి'', ''కావాలి'' అని చాలా గొంతులు పలికాయి.

''అయితే ఒక పని చేద్దాం. మన శ్రీధరమూర్తి నెలాఖరుకి వెడుతున్నాడు మద్రాసు !''

''సరే, హనీమూన్ ట్రిప్పుకి పోతున్నవాడిని...''

''తన్ని నాకొదిలేయండి. ఆ మాత్రం సాయం చేయకపోతే డొక్క చించెయ్యనూ !''

ఉదయంపూట శలవు పెట్టిన మూర్తి మధ్యాహ్నం ఆఫీసుకివస్తూనే అతన్ని తేనె టీగల్లా చుట్టేశారు.

విషయం అర్ధమయాక ఒళ్ళు మండిపోయింది మూర్తికి. గబగబ రావు దగ్గరకెళ్ళి ''ఇదా నువ్వు చేసే నిర్వాకం. శుభమా అంటూ మేం పోతుంటే ఈ బాదరబందీ అంటగడతావా నాకు ?'' అన్నాడు విరాగ్గా.

"ఏడిశావు, చెప్పినట్టు వినాలిసిందే! ఎవరెవరెంత ఇస్తారో లిస్టురాసి మరీ తీసుకో! వాళ్ళకి కావలసిన రంగులు ఏమిటో రాసుకో. రాత్రి ఎనిమిదింటికి రెడీగా ఉండు మీ ఇంటికి వస్తాను. ఇక పో" అన్నాడు రావు.

సాయంత్రానికి మూర్తి దగ్గర అయిదు వందలదాకా పోగయింది. ఇంటికి వెళ్ళా! ఇద్దరు ముగ్గురు ఇంటికివచ్చి కావలసిన రంగులు చెప్పి డబ్బిచ్చి వెళ్ళారు.

రావు రాగానే అడిగాడు మూర్తి "ఏమిటి నాయనా ఈ లీలలు ?" అని.

కిళ్ళీ వాసన ఘుమ ఘుమలాడగా చిద్విలాసంగా నవ్వాడు రావు. "భక్తుడిని ప్రాధేయపడ్డావుగద! ఇదంతా నీ ప్రయాణానికి పెట్టుబడి! "ఇప్పుడమ్మడం మానేశారుట" అని చెబుతావు నువ్వు తిరిగి రాగానే."

ఆశ్చర్యపోయాడు మూర్తి "తెలివంటే నీది గురూ!... తిరిగి వచ్చాక మాత్రం ఇవ్వద్దూ ?',

"దానిదేముంది. నీదగ్గరనుంచి డబ్బు తిరిగి వచ్చిందే చాలుననుకుంటారు వాళ్ళు. మెల్లగా జీతంలో ఇద్దువుగాని. పద సినిమాకి తీసుకెళ్ళాలి నన్ను!"

యాత్రంతా అయ్యాక ఒక షర్ట్ పీస్ రావు కిచ్చాడు మూర్తి "గురువుగారికి కానుక" అంటూ.

నవ్వాడు రావు "ఏడిశావుగాని నువ్వు కుట్టించుకో. ఉపయోగించుకునేప్పుడు స్వ, పర బేధాలుండకూడదు. ప్రభువు, భృత్యుడు తేడాలుండకూడదు. నాకిచ్చావని తెలుస్తే వాళ్ళు ఏడుస్తారు"అన్నాడు.


పైవారమే!

జీవన పోరాటంలో

ఆశల ఆరాటం!

కొత్త సీరియల్

ప్రారంభం!


సీరియల్

# శాంతి  తీరం

చక్కిలం విజయలక్ష్మి

*(గత సంచిక తరువాయి)*

ఈ మధ్య వసంత మాధవి ఇంటికి రాలేదు. అసలు వచ్చిందికూడా ఒకటి రెండుసార్లు మాత్రమే.

గేటుదాటి లోనికి అడుగు పెట్టగానే ఆశ్చర్యపోయింది వసంత. గేటు ఆర్చీ మీద కాశీరత్నం తీగ ఒత్తుగా అల్లుకుంది. కాంపౌండు గోడ పొడవునా ఎరుపు తెలుపు రంగుల్లో మార్చి మార్చి మందారాలు, నందివర్ధనాలు విరగబూసి వున్నాయి. గేటు పక్కనే లోపలివైపు మల్లెపొద. నిండుగా పూచి 'మల్లెపూల బుకే'లా వుంది. సన్నటి కాలిబాట కిరువైపులా రంగు రంగుల జినియాలు విరగబడి నవ్వుతున్నాయి. ఎడమ ప్రక్కన కస్తూరి చామంతి మళ్ళు. కుడివైపు కొద్దిమేర గుండ్రటి షేప్‌లో పచ్చిక పెంచి, కత్తిరించబడి వుంది. వరండా రెండు చివరల్లో చూరుమీదికి పాకిన బోగన్ విల్లాలు పూశాయి. వరండా మెట్ల కిరువైపులా మనీప్లాంట్ పాకివుంది పైకి. మెట్లమీద కుండీల్లో లిల్లీలు. కాంపౌండంతా పూలతోపులా సువాసనలతో, తుమ్మెదలతో కన్నులపండువుగా వుంది. మెట్లెక్కి వరండా మీద కాలు మోపింది, వరండా పొడవునా చూరుమించి వేళ్ళాడదీసిన చిన్న చిన్న కుండీల్లోంచి గుంపులుగా తొంగి చూస్తున్న టేబుల్ రోజాలను చూస్తూ. వరండాలో ఇరువైపులా పేం కుర్చీలు. మధ్యగా చిన్న టీపాయ్ మీది ఫ్లవర్‌వాజ్ లోని తాజా గులాబీలను చూస్తూ సన్నగా కదులుతున్న తెరను తొలగించుకుని హాలు లోకి నడిచింది వసంత. మాధవి కనిపించ లేదు. కుడివైపునున్న డ్రాయింగ్ రూంలోకి వెళ్ళింది. అక్కడా లేదు మాధవి. వంట గదిలోనూ, పెరటోనూ లేదు. తిరిగి డ్రాయింగ్ రూంలోకి వచ్చి కుర్చీలో కూర్చుంది ఆలోచిస్తూ. తలుపులన్నీ తెరిచిపెట్టి ఎక్కడికి వెళ్ళినట్టు ? తన దగ్గరికే వచ్చిందా ? అలాగైతే ఎదురు పడాలి కదా తనకు ? ఎక్కడికైనా కానీ తలుపులు తీసిపెట్టి ఎందుకు వెళ్తుంది ?

వసంత చూపు ఒకచోట నిలిచింది. గోడలో వున్న చిన్న తలుపుల అల్మెరాకు

**జరిగినకథ 8 :** గమ్యం తెలియకుండా ప్రయాణిస్తూ రైల్లో తారసిల్లిన మాధవిని తనతోపాటు తీసుకొస్తాడు శ్రీనాథ్. మాధవి, శ్రీనాథ్ భార్య వసంత స్నేహితులు. పెళ్ళి కాకుండానే గర్భవతయిన మాధవి వసంత ఇంట్లోనే వుండి పోతుంది. బిడ్డనుకన్న మాధవి కాలక్షేపంకోసం అంటూ పట్టుపట్టి వుద్యోగంలో చేరుతుంది. వేరే ఇల్లు తీసుకుని వెళ్ళిపోతుంది మాధవి. వసంత పట్టుదలమీద తన జీవితంలో చీకటిని వదలిపోయిన సంఘటనలను గురించి చెప్పటం ప్రారంభిస్తుంది మాధవి. బి. ఇ. చదువుతున్న నరేంద్రతో పరిచయమౌతుంది మాధవికి. నరేంద్రకు ప్రేమభిక్ష పెడుతుంది మాధవి. మాధవి నరేంద్రలు రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుంటారు. స్నేహితుడి పెళ్ళికంటూవెళ్ళిన నరేంద్ర జీప్ ప్రమాదంలో మరణిస్తాడు... ... శ్రీనాథ్ మేనత్తకొడుకు కుమార్ వస్తాడు. మాధవి విధవ అని తెలిసి బాధపడ్డాడు కుమార్. నేను మిమ్మల్ని వివాహం చేసుకుంటాను అని అడగాలనుకుంటున్న కుమార్‌కి పరోక్షంగా తన విముఖత తెలియచేస్తుంది మాధవి.